
ఈనాడు శ్రీకాకుళం



విద్యుద్దీప వెలుగుల్లో కోటబొమ్మాళి రహదారి

కొత్తమ్మ తల్లీ.. కరుణించమ్మా!

● నేడు జాతరలో ఆఖరి ఘట్టం

కొత్తమ్మ తల్లి జాతరకు రెండో రోజు (బుధవారం) భక్తులు పోటెత్తారు. ఉదయం వర్షం కురిసి వాతావరణం చల్లబడటంతో రద్దీ నెలకొంది. సంతబొమ్మాళి, మంచాలపేట, యలమంచిలి, బంజీరుపేట-తోటాడ, కురుడు-దంత రహదారులు కిక్కిరిసిపోయాయి. పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ప్రధాన మార్గం, ఆలయ ప్రాంగణంలో విద్యుద్దీప అలంకరణలు ఆకట్టుకున్నాయి. కురుడు, చౌదరికొత్తూరు గ్రామాలకు చెందిన పలువురు నాయకులు అల్పాహారం పంపిణీ చేశారు. జాతర చివరి రోజు గురువారం కమ్మకట్టు చినఅప్పలనాయుడు ఇంటి నుంచి జంగిడి పెద్దఎత్తున ఘటాలతో అమ్మవారి ఆలయానికి చేరుతుంది. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. 25 వేల మందికి అన్నదానం చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు వంటకాలు సిద్ధం చేస్తున్నారు. ఈవో వాచకర్ల రాధాకృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి



ఆలయం వద్ద భక్తుల రద్దీ



వసతిగృహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఐటీడీఏ ఏర్పాటుకు కృషి

పాతపట్నం, న్యూస్‌టుడే: 'ఎన్నికల హామీల్లో భాగంగా జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటుకు కృషి చేస్తాం. విద్యా ప్రగతికి పాతపట్నం, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో ఐటీఐల మంజూరుకు చర్యలు తీసుకుంటాం' అని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు హామీ ఇచ్చారు. పాతపట్నంలో రూ.2.30 కోట్లతో ప్రధాన మంత్రి జన్‌మన్ వసతిగృహ నిర్మాణ పనులకు బుధవారం రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. 'పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం. సామాజిక ఆసుపత్రిని 100 పడకల స్థాయికి తీసుకెళ్తాం' అని పేర్కొన్నారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గంలో మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ ఎల్‌ఎన్‌పేటలో పోలీసు స్టేషన్, కొత్తూరులో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి, పాతపట్నంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఈవో తిరుమల చైతన్య తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే ఆధ్వర్యంలో హిరమండలం మండలం ధనుపురం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ధనుపురం, కమలమ్మ కొట్టు కూడలి, కొరసవాడ వద్ద భారీ గజమాలలతో కేంద్ర, రాష్ట్ర మంత్రులకు పలువురు నాయకులు స్వాగతం పలికారు.



ధనుపురంలో భారీ ర్యాలీ

గాంధీ మాట.. భవితకు బాట

జిల్లావ్యాప్తంగా బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సూచించిన మార్గాన్ని అనుసరించి భవితకు బాటలు వేసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో బాపూ నామాలతో శతనామ అష్టోత్తర పూజ నిర్వహిస్తున్న చిత్రమిది.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్



మహాత్మా వందనం..!


జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి..

జాతిపిత మహాత్మాగాంధీ తత్వాన్ని అందరూ అలవరచుకోవాలని, ఆయన చూపిన మార్గంలో నడవాలని వక్తలు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా బుధవారం గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా బాపూ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి నిర్వహించారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం, కలెక్టరేట్, నేరవార్తావిభాగం, లీగల్


గాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా


కలెక్టరేట్ ఆవరణలో..


కాశీబుగ్గ: బాపూజీ జయంతి కార్యక్రమంలో మాజీ సైనికులు

612 మంది రక్తదానం

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకొని రణస్థలం మండలం నడుకుదిటిపాలెం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో బుధవారం మెగా రక్తదానం శిబిరం జరిగింది. ఎన్‌ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, శ్రీమహలక్ష్మి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధికారులు, పోలీసులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 612 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన వారిలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఎస్పీ వివేకానంద ఉన్నారు. ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఎస్పీ వివేకానంద, చిత్రంలో ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఈశ్వరరావు, ఎస్పీ మహేశ్వరరెడ్డి, తదితరులు

అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛ శ్రీకాకుళం

కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు


సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, తదితరులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ప్రజలందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛ శ్రీకాకుళం సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా శ్రీకాకుళం నగరంలో బుధవారం 'స్వచ్ఛతా హీ సేవ' ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అరసవల్లి కూడలి నుంచి డచ్ బంగ్లా వరకు సైకిల్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ రెండు వారాల పాటు జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, డ్వాక్రా మహిళలు, తదితరులు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. గ్రామాల్లోనూ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నాలుగు శతాబ్దాల చరిత్ర కలిగిన డచ్ భవనం వద్ద ఉద్యానం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థుల ప్రదర్శనలను తిలకించి.. మొక్కలు నాటారు. పలువురికి స్వచ్ఛతా హీ సేవ పురస్కారాలు ప్రదానం చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్, నగరపాలక సంస్థ కమిషనర్ వీవీడీ ప్రసాదరావు, డీఎస్పీ వివేకానంద, తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, పోలాకి, కవిటి గ్రామీణం, సోంపేట

దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ బోధన..!

ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు డిజిటల్ విద్యనందిస్తున్నారు. భవిత కేంద్రాల్లోని ఉపాధ్యాయులు ట్యాబ్‌ల ద్వారా చిన్నారులకు పాఠాలు బోధిస్తున్నారు. పుట్టుకతో అంధత్వం, వినికిడి సమస్యతో ఇబ్బందులు పడుతున్నవారికి చదువుపై ఆసక్తి పెంచేందుకు కేంద్రం ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జిల్లాలోనూ అమలు చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 30 భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో 648 మంది చిన్నారులు సేవలు పొందుతున్నారు. వీరు కాకుండా కొందరు ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్నారు. దివ్యాంగులు, ఉపాధ్యాయులకు కలిపి ప్రభుత్వం 235 ట్యాబ్‌లు అందజేసింది. ఆ ట్యాబ్‌ల్లో రకరకాల వైకల్యాలను అధిగమించేందుకు వీలుగా 30కిపైగా ప్రత్యేక యాప్‌లను నిక్షిప్తం చేశారు. అవి దివ్యాంగుల్లో మంచి మార్పులకు ఉపకరిస్తున్నాయి. చదువులోనూ క్రమేపీ మెరుగుపడేందుకు దోహదపడుతున్నాయి. దీన్ని గుర్తించిన ఉన్నతాధికారులు డిజిటల్ బోధనను మరింత పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయించారు. డిజిటల్ విద్యపై శతశాతం పట్టు సాధించేలా దివ్యాంగులను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు.


ట్యాబ్‌ల ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయుడు

వివిధ యాప్‌లు.. అనేక ఉపయోగాలు..

గూగుల్ లుక్ అవుట్ యాప్ ద్వారా వినికిడి, దృష్టి లోపాలు ఉన్న చిన్నారులకు ఏ వస్తువు పదం ఏ విధంగా పలకాలి, దాన్ని స్పృశించినప్పుడు ఎలా గుర్తించాలి వంటి అనేక విషయాలు నేర్పుతున్నారు. బుద్ధిమాంద్యం పిల్లలకు బొమ్మల రూపంలో నేర్పించే యాప్, వినికిడి సమస్య కలిగిన వారికి తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠం అక్షర రూపంలో కనిపించడం, అంధ చిన్నారులకు ఎవరి సాయం లేకుండా గమ్యాన్ని చేరుకొనే యాప్ వంటివి ఉన్నాయి. గూగుల్ ఫ్యామిలీ లింక్ యాప్ ద్వారా విద్యార్థి ట్యాబ్‌తో చేసే ప్రతి పని అందరూ తెలుసుకునే వీలుంటుంది. దీన్ని ఉపయోగించి ఉపాధ్యాయుల బోధననూ అధికారులు పరిశీలించవచ్చు. అవసరమైన మార్పులను వెంటనే సూచించే అవకాశం ఉంటుంది.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం..

వినికిడి, దృష్టి లోపం ఉన్న పిల్లలకు డిజిటల్ విద్య వరంలాంటిది. జిల్లాలో 235 మంది పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చాం. వాటి వినియోగం, ఆన్‌లైన్ బోధనపై 60 మంది ఉపాధ్యాయులకు శిక్షణ అందించాం. సాంకేతికత సాయంతో మెరుగైనా ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటాం.

– బుడుమూరు గోవిందరావు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త, శ్రీకాకుళం

బహిరంగ ప్రకటన

నా క్లయింట్లైన 1) నక్క రాంప్రసాద్ S/o. త్రినాథరావు, పెద్దపాడు గ్రామం, శ్రీకాకుళం మండలం, శ్రీకాకుళం జిల్లా 2) మూల రాము S/o. రాంమూర్తి, తోటవాడ గ్రామం, ఆమదాలవలస మండలం, శ్రీకాకుళం జిల్లా వార్లు ఇచ్చిన భోగట్టా మేరకు యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా!

పైన తెల్పిన నా క్లయింట్లు, ఈస్ట్ పాయింట్ కాలనీ, LB కాలనీ, విశాఖపట్నం సిటీ & జిల్లా వాస్తవ్యులైన 1) మణికొండ SVSSJ రాఘవరావు 2) మణికొండ SHM రామస్వామి S/o. వెంకట రాధాక్రిష్ణ (లేటు) వారి వద్ద నుండి తేది. 27-02-2021న ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తికి క్రయ అగ్రిమెంట్ పొందియున్నారు. తదుపరి నా క్లయింట్లు పూర్తి క్రయ అగ్రిమెంట్ ప్రతిఫలంతో సిద్ధంగా ఉన్నప్పటికీ సదరు 1) మణికొండ SVSSJ రాఘవరావు 2) మణికొండ SHM రామస్వాములు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా క్రయ అగ్రిమెంట్ ఆస్తిని నా క్లయింట్లు పేరున రిజిస్ట్రేషన్ చేయుటకు కాలయాపన చేయడం వలన నా క్లయింట్లు శ్రీయుతులు శ్రీకాకుళం 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో Suit for Specific Performance దావా వేయగా సదరు కోర్టు వారు I.A. No: 301/2024, O.S. No: 46/2024 నెంబరు ఇచ్చి సదరు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని మణికొండ SVSSJ రాఘవరావు మరియు మణికొండ SHM రామస్వామి గార్లు వేరెవ్వరితో లావాదేవీలు జరుపకుండా శ్రీయుతులు కోర్టు వారు ఇంజెంక్షన్ ఆర్డర్‌ను జారీ చేసియున్నారు. కేసు పెండింగ్‌లో ఉన్నది. కావున వేరెవ్వరయినా సదరు మణికొండ SVSSJ రాఘవరావు మరియు మణికొండ SHM రామస్వామి గార్ల వద్ద నుండి ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు జరపరాదనిన్నీ, అట్లు జరిపిన యెడల అవి నా క్లయింట్ల హక్కులకు బంధింపవనిన్నీ మరియు అట్టి వారిపై నా క్లయింట్లు చట్టపరంగా తగు సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొందురనిన్నీ, ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది.

షెడ్యూల్ దాఖలా ఆస్తి వివరములు: శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్ రిజిస్ట్రార్, శ్రీకాకుళం మండలం, పాత్రునివలస గ్రామం మరియు పంచాయతీ, ఓల్డ్ సర్వే నెం. 486, 487, న్యూ సర్వే నెం. 282, 283 గల పురా ఎ. 7-66 సెంట్లులో 4000 చ॥అ॥ (ప్లాట్లు 1 to 7, 9 to 17, 70, 71, 72, 81, 84, 85, 89, 90, 99, 100, 102, 103, 104) మొత్తం 29 అప్రూవ్డ్ లే-అవుట్ ప్లాట్లు L.P. No: 19/2019/1167/DTCP/DPMSకు హద్దులు: తూర్పు: లే-అవుట్ కాంపౌండ్ వాల్, దక్షిణం: లే-అవుట్ కాంపౌండ్ వాల్, పడమర: లే-అవుట్ కాంపౌండ్ వాల్, ఉత్తరం: లే-అవుట్ కాంపౌండ్ వాల్.

శ్రీకాకుళం,
తేది: 02-10-2024.

కొంక్యాన సుభాష్ M.A.,M.A.,LL.M,
సీనియర్, న్యాయవాది, న్యూ కాలనీ, శ్రీకాకుళం
Cell: 98491 40211

నేటి నుంచి టెట్

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 21 వరకు ఉదయం, మధ్యాహ్నం ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షలకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర, శివానీ ఇంజినీరింగ్ కళాశాలలు, నరసన్నపేట మండలం గొట్టిపల్లి వద్ద కోర్ టెక్నాలజీ, ఒడిశాలోని బ్రహ్మపుర కళ్లికోట కళాశాలలో అయాన్ డిజిటల్ జోన్, చండీపదర్‌లోని ఎస్ఎంఐటీ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాల, బృందావన్ విహార్‌లోని అంకుష్‌పూర్ ఎస్ఎంఐటీలో పరీక్షలు జరుగుతాయి. జిల్లా నుంచి 16,185 మంది హాజరవుతున్నారు. నరసన్నపేట కేంద్రంలో అత్యధికంగా 10,091 మంది, ఒడిశా కేంద్రాల్లో 1,874 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.

సీనియర్ సహాయకులు, ఆర్ఐల బదిలీ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖకు సంబంధించి జిల్లాలో పలువురు సీనియర్ సహాయకులు, ఆర్ఐలకు బదిలీ జరిగింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ 61 మందిని వివిధ మండలాలకు కేటాయిస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పలువురు సీనియర్ సహాయకులను ఆర్ఐలుగాను, ఆర్ఐలను సీనియర్ సహాయకులుగా బదిలీ చేశారు.

3 నుంచి మహిళలకు ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలులోని జెమ్స్ ఆసుపత్రిలో ఈ నెల 3 నుంచి 20వ తేదీ వరకు మహిళలకు రొమ్ము క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు ఉచితంగా చేస్తామని, అవకాశాన్ని వినియోగించుకోవాలని యాజమాన్య ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	140	235	255

వాణిజ్య బ్యాంకులతో సమానంగా ఏపీజీవీబీ సేవలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్, చిత్రంలో సంఘాల నాయకులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: వాణిజ్య బ్యాంకులతో సమానంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ) సేవలందిస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం అఖిల భారత గ్రామీణ బ్యాంకుల గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 90కిపైగా శాఖల ద్వారా అత్యుత్తమ సేవలందించడం అభినందనీయమన్నారు. 12వ వేతన సవరణ ఒప్పందాన్ని అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వేడుకల్లో వివిధ సంఘాల అధ్యక్షులు కేకే మక్కడ్, పి.వేణురావు, ప్రధాన కార్యదర్శులు గంట అప్పలనాయుడు, కేవీఎస్‌వీఎన్ రాజు, ఉత్తరాంధ్ర మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపండి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ డిమాండు చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. నిరాహార దీక్షలకు మద్దతుగా జేవీవీ రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు నల్లి ధర్మారావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు సీహెచ్ రాజు, సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, బాలికల కన్వీనర్ పవిత్ర, జిల్లా నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేత కృష్ణా

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాల సందర్భంగా కోటబొమ్మాళిలో 3 రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. మొత్తం 35 జట్లు పోటీల్లో పాల్గొనగా.. నాకౌట్ దశకు ఎనిమిది చేరుకున్నాయి. ఫైనల్స్‌లో కృష్ణా, తూర్పుగోదావరి తలపడగా.. కృష్ణా 17 పాయింట్ల ఆధిక్యంతో విజయం సాధించింది. విజేతలకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు బహుమతులు అందచేశారు. ఉత్తమ రైడర్‌గా చెంగళరావు (శ్రీకాకుళం), ఉత్తమ డిఫెండర్‌గా సాయి (తూర్పుగోదావరి), ఆల్‌రౌండర్‌గా శ్రీకాంత్ (కృష్ణా) జ్ఞాపికలు అందుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణారావు, సాధు శ్రీను, నిర్వహణ కార్యదర్శి తిరుపతిరావు, తెదేపా నాయకుడు బోయిన రమేష్ పాల్గొన్నారు.

అరుణ కిరణ శోభ

అరుణ కిరణాలతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రం వెలిగిపోయింది. భానుడి లేలేత కిరణాలు రెండో రోజు బుధవారం ఆదిత్యుని మూలవిరాట్ చెంతకు చేరాయి. ఆకాశంలో మబ్బులు లేకపోవడంతో ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల వరకు కిరణ స్పర్శ జరిగింది. ఆ సమయంలో బంగారు వర్ణంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ దృశ్యాన్ని చూసేందుకు భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ నిర్వహణలో ప్రత్యేక పూజలు చేశారు. ఈవో వై.భద్రాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం




వంశధార రెండో దశ పనులు పూర్తి చేస్తాం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: వంశధార ప్రాజెక్టు రెండో దశ పనులను పూర్తి చేస్తామని, ఎడమ కాలువను ఆధునికీకరిస్తామని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వంశధార సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు రూపశిల్పి స్వర్గీయ సీఆర్ఎం పట్నాయక్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ త్వరలో నాగావళి వంశధార నదుల అనుసంధానాన్ని కొలిక్కి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. జలవనరులశాఖలో సీఆర్ఎం పట్నాయక్ అందించిన సేవలను కొనియాడారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఒడిశాతో ఉన్న అభ్యంతరాలను తొలగించి త్వరలోనే నేరడి బ్యారేజీ నిర్మాణం ప్రారంభిస్తామని, జిల్లాను అన్నపూర్ణగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, ఉత్తరాంధ్ర జలవనరులశాఖ సీఈ ఎస్.సుగుణాకరరావు, ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ డోల జగన్, ఒడిశా విశ్రాంత చీఫ్ ఇంజినీర్ సి.వి.ప్రసాద్, సీఆర్ఎం పట్నాయక్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


సీఆర్ఎం పట్నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, తదితరులు

దుబాయిలో వలసకూలి మృతి

స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి


అప్పన్న (పాతచిత్రం)

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: జీవనోపాధి కోసం విదేశానికి వెళ్లిన సంతబొమ్మాళి మండలానికి చెందిన ఓ యువకుడు అక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భావనపాడు గ్రామానికి చెందిన పోతుమాల అప్పన్న(37) దుబాయిలో ఓ ప్రైవేటు గ్యాస్ కంపెనీలో పని చేస్తున్నారు. గత నెల 5న విధుల్లో ఉండగానే ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. అక్కడే ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే నెల 19న మృతి చెందారు. అతనికి భార్య ధనలక్ష్మీ, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు చొరవ చూపడంతో మంగళవారం భావనపాడు గ్రామానికి చేరుకుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు, తెదేపా, జనసేన నాయకులు కోరారు.


కార్మికురాలి ఆత్మహత్య

హైదరాబాద్, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన ఓ కార్మికురాలు హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకుంది. పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళానికి చెందిన రవి తన కుటుంబంతో కలిసి పటాన్‌చెరు మండలం ముత్తంగి సాయిప్రియకాలనీలో నివాసముంటున్నారు. రవి, అతని భార్య ఓ పరిశ్రమలో.. వారి కుమార్తె శ్రావణి(23) మరోచోట కార్మికురాలిగా చేస్తోంది. బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన సమయంలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

నేటి నుంచి దసరా ఉత్సవాలు


అలంకరణలో స్వేచ్ఛావతి అమ్మవారు

ఇచ్ఛాపురం, కంచిలి, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం ఇలవేల్పు స్వేచ్ఛావతి అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం తొలిపూజ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్లు వేశారు. తాగునీరు, మరుగుదొడ్లు ఇతర ఏర్పాట్లు చేశారు. తొమ్మిది రోజులూ అన్న ప్రసాద వితరణకు అన్నపూర్ణాదేవి మండపాన్ని సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. అమ్మవారు కొలువుండే అంతరాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఒకవైపు నిత్య సంగీత కచేరి వేదిక ఏర్పాటుచేశారు. ఈ ఉత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ★ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కంచమ్మతల్లి ఆటోయూనియన్, కంచిలి భక్తుల ఆధ్వర్యంలో చేపట్టనున్న పూజలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. పూజా మండపం, విద్యుత్తు దీపకాంతులతో ఆలయాన్ని ముస్తాబు చేశారు.


విద్యుత్తు కాంతులతో ఆలయ ప్రాంగణంలోని ఉప ఆలయాలు

హుండీ ఆదాయం లెక్కింపు

కంచిలి పరిసర ప్రాంతాల ఆరాధ్యదైవం కంచమ్మతల్లి నెలవారీ హుండీ ఆదాయాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం లెక్కింపు చేపట్టారు. సెప్టెంబరు నెలకుగాను హుండీ ఆదాయం రూ.17,326 వచ్చినట్టు కమిటీ సభ్యులు తెలియజేశారు

పేద విద్యార్థికి సాయం

ఇచ్ఛాపురం గ్రామీణం, కవిటి, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం మండలం డొంకూరుకు చెందిన విద్యార్థి చింతాడ ముకుందరావు ఆడుతుండగా భుజానికి తీవ్ర గాయమైంది. పేదకుటుంబం కావడంతో చికిత్సకు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న 2018-తెలుగు సేవాసదన్, పాఠశాల యాజమాన్యం సంయుక్తంగా రూ.20వేలను అందజేసింది. ప్రధానోపాధ్యాయురాలు సరోజిని, ఉపాధ్యాయులు గోవిందరావు, వెంకటరమణ, కమలాకర్, సేవాసదన్ అధ్యక్షుడు మాల్యాద్రి, సులోచన తదితరులు పాల్గొన్నారు. ★ కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద బదకల అప్పారావుకు సన్యాసిపుట్టుగకు చెందిన హెల్పింగ్ హాండ్స్ సభ్యులు బుధవారం రూ. 7 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సభ్యులు సావాడ గణేష్ రెడ్డి, దక్కత శంకర్, పనపాన రవి, గుజ్జు సాయి కృష్ణ, కమల పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం గ్రామీణం: నగదు ఇస్తున్న దృశ్యం

సేవలతోనే గుర్తింపు

మందస, న్యూస్‌టుడే : ఏ ఉద్యోగి అయినా తాను ప్రజలకు అందించిన సేవలతోనే గుర్తింపు పొందుతారని వక్తలు అన్నారు. మందస ఎంపీడీవో తిరుమలరావు, ఈవో పీఆర్డీ రఘుపతిరావు బదిలీ అయ్యారు. వారికి వీడ్కోలు పలుకుతూ బుధవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ దానయ్య, జడ్పీటీసీ సభ్యురాలు చంద్రమ్మ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

గత పాలకుల నిర్లక్ష్యాలు.. ప్రజల కన్నీటి కష్టాలు

న్యూస్‌టుడే, పలాస గ్రామీణం: పలాస మండలంలో స్వచ్ఛమైన తాగునీరు పూర్తిస్థాయిలో అందని గ్రామాలు ఇంకా ఉన్నాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకవైపు వర్షాలు, మరోవైపు విషజ్వరాలతో సతమతమవుతున్న ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందని దుర్భర మారుతోంది. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు అందించడానికి ఏర్పాటు చేసిన ట్యాంకులు కొన్ని శిథిలావస్థకు చేరి పెచ్చులూడిపోయే స్థితిలో ఉన్నాయి.


బంటుకొత్తూరులో రెయిలింగ్ దుస్థితి

రంగులేసి వదిలేశారు..

గత ప్రభుత్వ హయాంలో తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినా కొన్ని చోట్ల పనులు జరగలేదు. మరి కొన్ని చోట్ల ముప్పై ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంకులకే రంగులు వేసి కొత్తగా కనిపించేలా మార్పులు చేశారు. పాత ట్యాంకులు ఉన్న చోట్ల మెట్లు శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడే లేడు. కొన్ని ట్యాంకుల వద్ద పరిశుభ్రత కొరవడింది. దాని కారణంగా ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవానికి ప్రతి ట్యాంకును 15 రోజులకోసారి శుభ్రం చేయాలి. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా అలా జరగడం లేదు.

ట్యాంకులు శుభ్రం చేయరు..

పలాస మండలం బ్రాహ్మణతర్లాలో సుమారు 4700 మంది నివసిస్తున్నారు. రెండు నీటి ట్యాంకులు ఉన్నాయి. ఇందిరా కాలనీ వద్దట్యాంకు మెట్ల రెయిలింగ్ పాడై పోయి ఉండటంతో శుభ్రం చేయడానికి వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. మామిడిపల్లి గ్రామంలో మెట్లు కూలిపోవడంతో ట్యాంకు పైకి వెళ్లి దాన్ని శుభ్రం చేసే సాహసం చేయడం లేదు. దాదాపు రెండేళ్లుగా అక్కడ నుంచి వచ్చిన నీటిని ప్రజలు తాగడంతో గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి.


బ్రాహ్మణతర్లాలో మెట్ల పరిస్థితి

చర్యలు తీసుకుంటాం

శిథిలావస్థకు చేరిన ట్యాంకులను తొలగించి కొత్తవి నిర్మిస్తాం. మెట్ల రెయిలింగ్ పనుల కోసం ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే మరమ్మతు పనులు చేపడతాం.

-బి.ధనుంజయ ఏఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పలాస గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం	9440437129
పలాస	8008574279
కవిటి గ్రామీణం	8309638875
పలాస గ్రామీణం	7386408926
కంచిలి గ్రామీణం	9704568738

? **సమస్య:** పలాస మండలం రెంటికోటలోని గొల్ల, రెడ్డిక వీధుల మధ్యలో దీపాలు వెలగడం లేదు. **స్థానికులు**

☛ **సమాధానం:** రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.

- సద్గుణ, పంచాయతీ కార్యదర్శి, రెంటికోట
– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

? ఇచ్ఛాపురం పట్టణం ఉప్పాడవీధి వద్ద రహదారి పనులు మధ్యలో ఆపేయడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.

-వి.లోకనాథం, ఇచ్ఛాపురం

☛ ఆ రహదారి మార్గం పనులు పూర్తికావాల్సి ఉంది. పరిశీలించి, అధికారులకు నివేదిక పంపిస్తాం.

-పి.కామేశ్వరరావు, ఏఈ, ఇచ్ఛాపురం
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? పలాస సీతారామనగర్‌లో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసినా పరిస్థితి అలాగే ఉంది.

☛ దీపాలకు మరమ్మతులు చేశాం. వెలగటం లేదని సమాచారం వచ్చింది. మళ్లీ మరమ్మతులు చేపడతాం.

-సురేష్, విద్యుత్తు సిబ్బంది, పలాస
– న్యూస్‌టుడే, పలాస

4న నేత్ర వైద్య శిబిరం

నరసన్నపేట గ్రామీణం: ఉర్లాంలో ఈ నెల 4న జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శిమ్మినాయుడు ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు పాల్గొంటారన్నారు.

వర్షం పడితే నడకా నరకమే..!



వజ్రపుకొత్తూరు మండలం ఎన్‌పీరోడ్డు నుంచి ఉద్దానం కూర్మనాధపురం మీదుగా కొండవూరు వరకు ఉన్న గ్రావెల్ రోడ్డులో చిన్నపాటి వర్షానికే రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల కిందట ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా గ్రావెల్ రోడ్డు వేసినా.. తిత్లీ తుపాన్‌కు రహదారి పలుచోట్ల ధ్వంసమైంది. ఇటీవల కురిసిన వర్షానికి ఇలా బురదమయంగా మారడంతో విద్యార్థులు నానా కష్టాలు పడుతూ ప్రయాణం సాగించారు. ఈవిషయమై పీఆర్ జేఈ నాగభూషణ్ మాట్లాడుతూ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

ముళ్లపొదలతో ప్రమాదం..

ఇచ్ఛాపురం పట్టణం నుంచి రత్తకన్నకు చేరుకునే కొళిగాం రోడ్డు దుస్థితి ఇది. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై ముళ్ల చెట్టు కొమ్మలు రహదారి పైన విస్తరించడంతో వాహన చోదకులు గాయపడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలకు తప్పించే క్రమంలో గాయపడుతున్నామని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ర.భ.శాఖ ఏఈ పి.మోహనరావు మాట్లాడుతూ.. ముళ్ల పొదలు తొలగిస్తాం. నిధులు విడుదలయ్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



రహదారిపైనే చెత్త..



పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం టి.కె.ఆర్.కల్యాణ మండపం పక్కవీధిలో కాలువ నుంచి తీసిన పూడికలు రహదారిపై వదిలేయడంతో రాత్రివేళ రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్టుకొమ్మలు తొలగించి వాటని అక్కడే వదిలేశారని, అధికారులు స్పందించి రోడ్డుపై చెత్త, చెట్టుకొమ్మలు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. సిబ్బందిని పంపించి రహదారులపై ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని పారిశుధ్య కార్యదర్శి ఉదయ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, పలాస

సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టరూ..

వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం ఎస్సీ వీధి నుంచి పెదవంక బీటీ రోడ్డు వరకు ఉన్న మార్గం అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి పూర్తిగా కొట్టుకుపోవడంతో రాళ్లు తేలి దర్శనమిస్తోంది. సీసీ రోడ్డు నిర్మించి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సీసీ రోడ్డు ఏర్పాటుకు గ్రామ సభలో తీర్మానం చేశామని సర్పంచి బత్తిని సృజన తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు



కళాశాల మైదానాభివృద్ధి ఎప్పుడు?



ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో అక్రమార్కుల యథేచ్ఛగా మట్టిని తవ్వేయడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. విద్యార్థులు ఆటలాడుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని గుర్తించిన ఓ వ్యాపారవేత్త కొండ కంకరతో పూడ్చేందుకు గత ఏడాది ప్రయత్నించారు. కొండను తవ్వేస్తున్నారన్న ఫిర్యాదుతో ఆ పనులు ఆగిపోయాయని ప్రిన్సిపల్ డా.రాబిన్ కుమార్ పాఢి తెలిపారు. ప్రభుత్వం అనుమతి ఇస్తే దాతల ద్వారా గుంతలను పూడ్చుకోవచ్చని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే డా.బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లగా కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వెంకన్న పటంతో కూటమి నాయకుల తిరువీధి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ధర్మో రక్షతి రక్షితః అనే సూక్తిని అందరూ అనుసరించాల్సిందే. ఎప్పటికైనా ధర్మమే జయిస్తుందని, గత పాలకుల పాపాల వల్ల రాష్ట్రానికి కలిగిన అన్యాయం నుంచి వేంకటేశ్వర స్వామి రక్షిస్తారని కూటమి నాయకులు పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన 11 రోజుల దీక్ష పూర్తయిన సందర్భంగా బుధవారం రాత్రి ఇచ్ఛాపురంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గిలాయివీధిలో ఉన్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన నాయకులు దాసరి రాజు, భాజపా నియోజకవర్గ బాధ్యురాలు బుద్ధాల నిర్మలారెడ్డి పాల్గొని, పట్టణ వీధుల్లో నగరసంకీర్తన చేశారు. ★ నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషిచేస్తానని, కూటమి ప్రభుత్వంతోనే దేశ, రాష్ట్ర ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే డా.బెందాళం అశోక్ అన్నారు. ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టిలో గ్రామస్థులు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామముఖద్వారం వద్ద నుంచి మహిళలు, పెద్దలు, యువత ఘనస్వాగతం పలికారు.

కొబ్బరి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : ఉద్దానం కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం తీర్చుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం రాజపురం గ్రామంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా రైతులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కొబ్బరి ఆశిస్తున్న వివిధ తెగుళ్లపై పరిశోధనలు చేసి వాటి నివారణకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పథకాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యానశాఖ అధికారిణి మాధవీలత, మాజీ జడ్పీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మహాత్ముని బాటలో పయనిద్దాం..


పలాస గ్రామీణం: బ్రాహ్మణతర్లాలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

జాతిపిత మహాత్మాగాంధీ చూపిన బాటలో అందరం ముందుకు సాగుదామని పలువురు వక్తలు పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం మహాత్ముడి విగ్రహ, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సైనికులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే బృందం


కాశీబుగ్గ: వజ్జ బాబూరావు, తెదేపా నాయకులు


కంచిలి: నివాళులర్పిస్తున్న చిన్నారులు


ఇచ్ఛాపురం గ్రామీణం: లొద్దపుట్టి గాంధీవీధి కూడలిలో ఎమ్మెల్యే అశోక్


కవిటి గ్రామీణం: ఎమ్మెల్సీ రామారావు, తదితరులు

విరాళం అందజేత



పరోపకారం, జన్మభూమికి కొంతవరకూ తోడ్పాటు, పేదలు, అభాగ్యులకు అండగా నిలవాలన్న లక్ష్యంతో గల్ఫ్ ఫౌండేషన్ ఏర్పాటుచేసినట్లు పురుషోత్తపురం పెద్దలు, యువత తెలిపారు. గ్రామంలోని పెద్దవీధికి చెందిన గాలి కేశవరావు గత ఏడాది రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లనూ పోగొట్టుకున్నాడు. ఆ కుటుంబానికి ఆధారమైన కేశవరావు మంచానికే పరిమితం కావడంతో కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని, వారికి రూ.10వేలు అందించారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

యూనిటీ కప్ విజేత టెక్కలి

టెక్కలి: సత్యసాయి బాబా జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూనిటీ కప్ పేరుతో జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వీటిలో టెక్కలి పెద్ద మందిరం వీధి జట్టు ప్రథమ స్థాయిలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.

కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతులు



కంచిలి మండలం అంపురం - ఘాటిముకుందపురం ఆర్అండ్‌బీ రోడ్డు నారాయణబట్టి వద్ద ఇటీవల కల్వర్టు కూలడంతో ఇరువైపులా సుమారు 15 పంచాయతీల పరిధి గ్రామాలతో పాటు సరిహద్దు ప్రాంతాలకు రాకపోలకు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రూ.4.9 లక్షల అంచనాతో తాత్కాలిక కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఆర్అండ్‌బీ డీఈఈ రామినాయుడు దగ్గరుండి పనులను పర్యవేక్షించి తాత్కాలిక కల్వర్టు ఏర్పాటుచేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగించారు. ఎమ్మెల్యే అశోక్ కృషితో రాకపోకల సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయంలో రివర్స్ టెండర్‌లో వెనక్కి వెళ్లిన నిధులను తిరిగి తెప్పించి త్వరలోనే రోడ్డు విస్తరణ పనులతోపాటు అన్ని చోట్ల పూర్తి స్థాయిలో కల్వర్టులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలియజేశారు.

– న్యూస్‌టుడే, కంచిలి

బారువ ఆసుపత్రి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి

సోంపేట, న్యూస్‌టుడే: బారువ సామాజిక ఆసుపత్రి భవన సముదాయాన్ని వెంటనే పూర్తి చేసి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీడాప్ మాజీ ఛైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. బుధవారం ఆసుపత్రి భవనాల నిర్మాణం ఆయన వైకాపా నాయకులతో కలిసి పరిశీలించారు. వైద్యపరికరాలు నిరుపయోగంగా పడి ఉన్నాయని, పేదలకు నామమాత్రంగానే సేవలందుతున్నాయని పేర్కొన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, వైకాపా నాయకులు జోగారావు, తిరుపతిరెడ్డి, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పడవప్రమాదంలో మృత్యువాత పడిన రట్టి అప్పన్న కుటుంబసభ్యులను వైకాపా నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

మలుపులున్నాయ్ జాగ్రత్త!


మాణిక్యపురం వద్ద ప్రమాదకర మలుపు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే మార్గాల్లో మలుపులు ప్రమాదాలకు చిరునామాలుగా నిలుస్తున్నాయి. పనికిరాని మొక్కలు, కంపచెట్లు వంటి వాటిని తొలగించే పనులు చేపట్టకపోవడంతో అవి గుబురుగా పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కవిటి నుంచి సోంపేట వెళ్లే రహదారిలో జగతి, బొరివంక, మాణిక్యపురం, రాజపురం వెళ్లే మార్గంలో జల్లుపుట్టుగ వచ్చే రహదారిలో అధికంగా మలుపులు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపానికి వచ్చేంత వరకు కనిపించక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

గ్రామాల్లో అధికం..

మండలంలోని సీమూరు నుంచి నెలవంక, భైరెడ్లపుట్టుగ, కొమ్ముపుట్టుగ, కపాసుకుద్ది, ముత్యాలపేట వయా మండల కేంద్రం కవిటి చేరుకునే రహదారిలో పలు గ్రామాల వద్ద ప్రమాదకర మలుపులు ఉన్నాయి. రాజపురం, బొరివంక నుంచి డి.గొనపపుట్టుగ, నర్తుపుట్టుగ జాతీయ రహదారికి చేరుకునే క్రమంలో వివిధ గ్రామాలను కలుపుతూ రహదారుల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. కుసుంపురం, బల్లిపుట్టుగ, మాణిక్యపురం మార్గాల్లో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి ఆయా మార్గాలలోనే రాకపోకలు సాగిస్తుంటారు.


కవిటి నుంచి రాజపురం వెళ్లే మార్గంలో..

ప్రమాద సూచికల్లేవ్..

మలుపులను సూచించే హెచ్చరిక బోర్డులు, స్టార్ గుర్తులు, వేగనియంత్రికలు వంటివి లేకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకటి పడితే ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహన చోదకులు హడలిపోతున్నారు. ఈ మలుపుల్లో మృత్యువాత పడిన సంఘటనలతోపాటు చాలా మంది గాయపడిన ఘటనలు ఉన్నాయని.. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. భద్రతా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిధులు రాగానే పనులు

పనికిరాని మొక్కలు, ముళ్లపొదలు తొలగించే పనులు చేపట్టాం. ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు వచ్చిన వెంటనే వేగనియంత్రికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

- ధనుంజయను పంచాయతీరాజ్ ఏఈ, మోహనరావు ఆర్అండ్‌బీ ఏఈ

విద్యార్థుల సూచనలు అభినందనీయం


విజేతగా నిలిచిన విద్యార్థిని సిరికి జ్ఞాపిక అందిస్తున్న ఎంఈవో అప్పారావు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 విజన్ కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనలకు తగిన రీతిలో విద్యార్థులు చక్కటి సూచనలు చేశారు. ‘స్వర్ణాంధ్ర 2047 మీ విజన్.. మా మిషన్’ ప్రభుత్వ పిలుపుతో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలతో మండల స్థాయి పోటీలు నిర్వహించగా, వ్యాసరచన పోటీలో గుమ్మడి ప్రేమ్‌కుమార్, ఉపన్యాస పోటీలలో రంగాల సిరి విజేతలుగు నిలిచారు. 15 పాఠశాలల నుంచి 60 మందికి పైగా పోటీల్లో పాల్గొన్నారు. గెలిపొందిన వారికి ఎంఈవో కె.అప్పారావు జ్ఞాపికలను అందించి, అభినందించారు.

పరిశుభ్రత.. మన బాధ్యత

ఇచ్ఛాపురం, పలాస, న్యూస్‌టుడే: ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం న్యాయస్థానం ఆవరణలో బుధవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని న్యాయవాదులు పేర్కొన్నారు. ◆ సూర్యోదయానికి ముందే విధుల్లోకి చేరి.. చీపురుపట్టి వీధులన్నీ శుభ్రపరిచే కార్మికుల సేవలు మహోన్నతమైనవని పురాధ్యక్షురాలు పిలక రాజలక్ష్మి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమ ముగింపు సందర్భంగా పుర కార్మికులను శాలువలు, పూలదండలతో సత్కరించి అభినందించారు.


పుర పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న పురాధ్యక్షురాలు రాజలక్ష్మి


ఇచ్ఛాపురం: న్యాయస్థానం ఆవరణలో న్యాయమూర్తి పి.పరేష్‌కుమార్ తదితరులు


పలాస పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో..

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? లఖిదాసుపురంలో గతంలో ప్రతీ 3 నెలలకు పశు వైద్య శిబిరం నిర్వహించేవారు. 5 నెలలు అవుతున్నా యంత్రాంగం స్పందించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. - **జోగారావు, స్థానికుడు**

● సిబ్బందికి తెలియజేసి గ్రామంలో త్వరలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేస్తాం.

- **మన్మథరావు, పశువైద్యాధికారి, నర్సిపురం**

- న్యూస్‌టుడే, నందిగాం

? జలుమూరు మండలంలో ఇసుక అందుబాటులో లేదు. గృహనిర్మాణ దారులకు ఇబ్బందులు తప్పడం లేదు. - **పట్ట మల్లేషు, చల్లవానిపేట**

● ఉచిత ఇసుక విధానంపై నదీ తీర గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి ప్రభుత్వానికి నివేదించాం. ఉత్తర్వులు వస్తే అందుబాటులోకి తీసుకొస్తాం.

- **జి.లక్ష్మీనారాయణ, తహసీల్దారు, జలుమూరు**

- న్యూస్‌టుడే, జలుమూరు

పల్లెలను శుభ్రంగా తీర్చిదిద్దుదాం

జలుమూరు, నరసన్నపేట, సారవకోట, హిరమండలం, టెక్కలి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరిలో చైతన్యం నింపి పల్లెలను శుభ్రంగా తీర్చిదిద్దుదామని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం పలుచోట్ల 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని నిర్వహించారు. అవగాహన ర్యాలీలు చేపట్టి నినాదాలు చేశారు. అనంతరం పరిసరాలను శుభ్రం చేశారు.



శ్రీముఖలింగంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పారిశుద్ధ్య నిర్వహణపై కలెక్టర్ ఆగ్రహం

పాతపట్నం, నరసన్నపేట, న్యూస్‌టుడే: పాతపట్నంలో పర్యటించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పారిశుద్ధ్య నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతపట్నం నుంచి కోదూరు వెళ్తున్న ఆయన రహదారికి ఇరువైపులా చెత్త ఉండటంతో ఈవోపీఆర్డీ కృష్ణారావు, కోదూరు పంచాయతీ కార్యదర్శిపై మండిపడ్డారు. వారికి మెమోలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ● పాతపట్నం వెళ్తున్న కలెక్టర్ నరసన్నపేట మండలం జమ్ము కూడలి చెత్త కుప్పలు తొలగించాలని పంచాయతీ ఈవో దాక్షాయణికి తెలిపారు. దీంతో పంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన వ్యర్థాలు తొలగించారు.



పాతపట్నం: అధికారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సొంత అవసరాలకు చెత్త సంపద తయారీ కేంద్రం

టెక్కలి, న్యూస్‌టుడే: తేలినీలాపురం పంచాయతీ వేములాడలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని కొంతమంది పశువుల శాలగా వినియోగిస్తున్నారని గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే అక్కడ నుంచి వారిని ఖాళీ చేయించాలని కోరారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. గ్రామంలో శాంతిభద్రతల సమస్యను సృష్టించేందుకు సదరు వ్యక్తులు కుళాయి పైప్‌లైన్లు ధ్వంసం చేసి, దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

కొత్తమ్మతల్లి సేవలో ప్రముఖులు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమతల్లి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజున బుధవారం సామాన్య భక్తులతో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.



రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతికి కొత్తమ్మతల్లి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, చిత్రంలో జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్నలత

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

సారవకోట, న్యూస్‌టుడే: అవలంగి నీలమణిదేవి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని బుధవారం బుడితి, అవలంగి, చీడిపూడి గ్రామాల్లో ఊరేగించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారని అర్చకులు తెలిపారు.

యజమానుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం

- న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

నరసన్నపేట నియోజకవర్గం లోని వివిధ గ్రామాల్లో పాడి రైతులు మూగజీవాలను నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. మరి కొందరు రహదారులను పశువుల శాలలుగా ఉపయోగిస్తుండటంతో అవి మురుగు కూపాలుగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో అపరిశుభ్రతతో పాటు రాకపోకల సమయంలో వాహనచోదకులకు, ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పశువులను తప్పించే క్రమంలో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు.



జల్లువానిపేట సమీపంలో వంతెనపై కట్టిన పశువులు

పంచాయతీలే చర్యలు తీసుకోవాలి

రూ.కోట్లు వెచ్చించి ప్రభుత్వాలు నిర్మిస్తున్న రహదారులకు ఇరువైపులా పశువులు కట్టడం సరికాదు. దీనిపై సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి. మూగజీవాలను కట్టడం నియంత్రించి రహదారులను పాడవకుండా చూడాలి.

- రాజశేఖర్, ఏఈ, ర.భ.శాఖ

ఇదీ పరిస్థితి..

● నరసన్నపేట మండలంలో లుకలాం- కొమనాపల్లి మార్గంలో కొత్తపోలవలస, నరసింగరాయుడుపేట, పాలకొండపేట, జల్లువానిపేట తదితర గ్రామాల్లో రహదారులు పశువులకు ఆవాసాలుగా మారాయి. బసివలస, ముసిడిగట్టు చెన్నాపురం, చిక్కాలవలస, మామిడివలస, ఉర్లాం గ్రామాల్లో పరిస్థితి ఇలాగే ఉంది. గ్రామాలకు సమీపంలోని వంతెనలపై పశువులు నిలుపుతున్నారు.

● జలుమూరు మండలంలో జలుమూరు, గొటివాడ, పాగోడు, పెద్దదూగాం, రామయ్యవలస, పర్లాం, బొడ్డపాడు గ్రామాల్లో వర్షాకాలంలో ప్రధాన రహదారులపై పశువులు కడుతుండటంతో వాహదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

● సారవకోట మండలంలో వాబ, అన్నుపురం, బొంతు, గొర్రిబంద, ధర్మలక్ష్మీపురం, అర్లి, కేజేపురం, కరడిసింగి, కురిడింగి గ్రామాల్లో రహదారికి ఇరువైపులా పశువులను కడుతున్నారు. దీంతో కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం ఉండటం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా



నరసన్నపేట మండలం మాకివలస ఉన్నత పాఠశాల ఆవరణ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. సాయంత్రం వేళల్లో మైదానంలో మందు బాబులు మద్యం తాగి సీసాలను అక్కడే విడిచిపెడుతున్నారు. రోజూ ఉదయం వాటిని తొలగించే పని విద్యార్థుల వంతు అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎస్సై దుర్గాప్రసాద్ వద్ద ప్రస్తావించగా, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- న్యూస్‌టుడే, నరసన్నపేట

ఇలా అయితే రోగాలు రావా..?



పోలాకి పంచాయతీలోని బీసీ కాలనీ, పాలవీధి ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లో ఉండటంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గొట్టాల్లో లీకులు ఏర్పడితే తాగునీరు కలుషితమయ్యే అవకాశముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు రోగాల బారిన పడకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇంఛార్జి ఎంపీడీవో సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. ఈవోపీఆర్డీకి తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, పోలాకి

బోరు బాగు చేశారు

స్పందనకు వందనం

నందిగాం, న్యూస్‌టుడే: దిమ్మిడిజోల అంగన్వాడీ కేంద్రానికి ఎదురుగా ఉన్న బోరు రెండు నెలలుగా పనిచేయక పోవడంతో స్థానికులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యపై 'పని చేయదు.. యంత్రాంగానికి పట్టదు' శీర్షికతో 'ఈనాడు'లో ఈనెల 1న ప్రచురితమైన వార్తకు ఎంపీడీవో టి.రాజారావు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఇంఛార్జి పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ బోరు బాగు చేయించారు.

వెలుగులు నియంత్రించారు

సారవకోట, న్యూస్‌టుడే: శివరాంపురంలో వీధి దీపాలు నిత్యం వెలుగుతుండేవి. దీనిపై ఈనెల 2న 'పగలే వెలుగులు' శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో కార్యదర్శి కె.సుశీల స్పందించారు. విషయాన్ని విద్యుత్తు శాఖ సహాయకుడికి తెలియజేయడంతో ఆయన పగటి వెలుగుల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు.

మహాత్ముల బోధనలు అనుసరణీయం



నందిగాం: గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి వేషధారణలో చిన్నారులు



నిమ్మాడలో అంజలి ఘటిస్తున్న రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కూటమి నాయకులు



పాతపట్నం: గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



నరసన్నపేటలో వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



పొన్నుటూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు



హిరమండలం: హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రిల జయంతి వేడుకలు బుధవారం నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల వారి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముల బోధనలు అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. రోగులకు పండ్లు, నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. - న్యూస్‌టుడే బృందం

గాన గంధర్వుడికి స్వర నీరాజనం

హిరమండలం: శ్రీ నీలమణి దుర్గా ఉత్తరాంధ్ర కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు, హిరమండలానికి చెందిన గాయకులు సుభలయ ఆర్ ఆర్ కాలనీ సామాజిక భవనంలో బుధవారం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాన గంధర్వుడికి స్వర నీరాజనంతో అంజలి ఘటించారు. గాయకులు ఆయన పాడిన గీతాలను ఆలపించారు.



దేశంలో నియంతృత్వ పాలన

టెక్కలి, న్యూస్‌టుడే: దేశంలో నియంతృత్వ పాలన సాగుతుందని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇంఛార్జి పి.పరమేశ్వరరావు అన్నారు. స్థానిక కంద్ర వీధిలోని గాంధీ ఆలయంలో బుధవారం వినతి పత్రం అందించారు. కేంద్రప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. పార్టీ నాయకులు మధుసూదనరావు, ఆనందరావు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రతీ సమస్యకు పరిష్కారం

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి): గ్రామాల్లో దీర్ఘకాలికంగా నెలకొన్న ప్రతీ సమస్యకు పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బుధవారం సౌడాం గ్రామంలో స్థానికులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు పలు సమస్యలను ఆయన ముందు ఏకరువు పెట్టారు. ఎంపీటీసీ సభ్యుడు సింహాచలం, రాంబాబు పాల్గొన్నారు.

ఆర్డీవో స్థల పరిశీలన

హిరమండలం: ఎంఎల్‌పురం గ్రామ పంచాయతీ లోకొండ రెవెన్యూలో బుధవారం టెక్కలి ఆర్డీవో సుదర్శన్‌దొర స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ భూమిని వాణిజ్య భూమిగా మార్చేందుకు వచ్చిన దరఖాస్తు నిమిత్తం తనిఖీలు చేసినట్లు చెప్పారు. డీటీ వెంకటరావు పాల్గొన్నారు.

సత్యసాయి యూనిటీ కప్ విజేత టెక్కలి

టెక్కలి: సత్యసాయి బాబా జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూనిటీ కప్ పేరుతో జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వీటిలో టెక్కలి పెద్ద మందిరం వీధి జట్టు ప్రథమ స్థాయిలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. సంస్థ ప్రతినిధులు చంటి, మల్లేశ్వరరావు, నారాయణమూర్తి, చంద్రమౌళి పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పునఃప్రారంభం

నరసన్నపేట: స్థానిక పంచాయతీ పరిధిలోని చెత్త సంపద కేంద్రాన్ని ఎమ్మెల్యే రమణమూర్తి బుధవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించాలన్నారు. ఎంపీడీవో మధుసూదనరావు, ఈవో దాక్షాయణి, కృష్ణబాబు, చిట్టిబాబు పాల్గొన్నారు.

4న నేత్ర వైద్య శిబిరం

నరసన్నపేట గ్రామీణం: ఉర్లాంలో ఈ నెల 4న జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శిమ్మినాయుడు ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు పాల్గొంటారని, సమస్యలున్న వారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని రావాలని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించ వచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్య: విశాఖ 'ఎ' కాలనీలో కథానిలయం సమీపంలో ఉన్న వీధి దీపం 20 రోజుల నుంచి వెలగడం లేదు. రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– ఎం.సత్యనారాయణ

పరిష్కారం: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **వీవీడీ ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ**

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

తెరపై ఈనాడు

● **కీర్తన:** సరిపోదా శనివారం ● **కీర్తిక:** దేవర ● **కిన్నెర సినీమాక్స్:** సత్యం సుందరం ● **ఎస్‌వీసీ (రామలక్ష్మణ):** దేవర ● **సూర్యమహల్:** దేవర ● **సరస్వతి:** దేవర ● **చంద్రమహల్:** మత్తు వదలరా-2 ● **మారుతి:** దేవర

– న్యూస్‌టుడే, అరసవల్లి

కొత్తకోటలో దుర్గమ్మ ఉత్సవాలు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తకోట గ్రామంలో గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు దుర్గమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఉత్సవాలు డోల రామకృష్ణ, ప్రభావతి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గమ్మకు పూజా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


స్వచ్ఛతా హీ సేవాపై ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్, మున్సిపల్ సిబ్బంది

పొందూరు, పొందూరు గ్రామీణం, ఆమదాలవలస పట్టణం, గార, బూర్జ, జి.సిగడాం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీవో హరిహరరావు, సర్పంచి రేగిడి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ● ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆమదాలవలస పట్టణంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి, పట్టణంలోని పెద్ద చెరువు గట్టుపై మొక్కలను నాటారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవాపై మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ● పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ అన్నారు. గార మండలం శ్రీకూర్మంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు. ● బూర్జ మండల కేంద్రంలో ఎంపీడీవో త్రినాథరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ప్లకార్డులతో వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఇందులో మార్కెట్ డైరెక్టర్ ఎ.రామకృష్ణ, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ● జి.సిగడాం మండలంలోని ఆనందపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అవగాహన ప్రదర్శన నిర్వహించడంతో పాటు పరిసరాలను మండల అధికారులు, సిబ్బంది శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ● సేతుబీమవరం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పారిశుద్ధ్య కార్మికులను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. వారికి దుశ్శాలువాలు కప్పి జ్ఞాపికలు అందించి సత్కరించారు.


గార: శ్రీకూర్మంలో వ్యర్థాలను తొలగిస్తున్న ప్రత్యేకాధికారి శాంతిశ్రీ, ఇతర అధికారులు

ఆదాయం ఘనం.. సౌకర్యాలు పూజ్యం..!

★ చింతాడ సంత దుస్థితి
★ మండుటెండ, బురదలోనే వ్యాపారాల నిర్వహణ


చింతాడ వారపు సంతలో నేలపైనే ఏర్పాటుచేసిన కాయగూరల దుకాణాలు

న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం, ఆమదాలవలస పట్టణం

ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 7వ వార్డు చింతాడ గ్రామంలో నిర్వహించే శనివారం వారపు సంతలో కనీస సౌకర్యాలు లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి శనివారం జరిగే వారపు సంతలో వందల మంది వ్యాపారులు, రైతులు ఇక్కడ తమ వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. [illegible], గొర్రెలు, మేకలు, కూరగాయలు, ఇతర వ్యాపారాలు నిర్వహించేవారితో పాటు కొనుగోలుదారులతో సంత కళకళలాడుతుంటోంది. దీని ద్వారా ఏటా మున్సిపాలిటీకి రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో వర్తక, వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నేలపైనే వ్యాపారాలు: రూ.లక్షల్లో వేలం పాట ద్వారా మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయానికి అనుగుణంగా సంతలో వ్యాపారస్థులకు నీడనిచ్చే షెడ్లు నిర్మించి, తాగునీరు, విద్యుత్తు, ఇతర సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉన్నప్పటికీ అవి ఎక్కడా కనిపించడం లేదు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి.

వర్షం పడితే బురదలోనే..: సంత సమయంలో కాని, ముందు రోజుల్లో కాని వర్షం పడితే వర్తక, వ్యాపారులు బురదలోనే వ్యాపారాలు చేసుకోవాల్సి వస్తుందని, ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు అవస్థలు పడుతున్నట్లు వారు ఆందోళన చెందుతున్నారు. వేలం పాట పాడినవారు ప్రతి వారం సంతలో వేల రూపాయలు ఆశీలు రూపంలో వసూలు చేస్తున్నారే తప్పా అధికారులు మాత్రం ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన చెందుతున్నారు. వెంటనే షెడ్లు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం: వారపు సంతకు ఆశీలు పాట ద్వారా ప్రతి ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా అధికారులు మాత్రం ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదు. వర్షం పడితే బురదలోనే వ్యాపారాలు చేసుకోవాల్సి వస్తుంది. మాకు సౌకర్యాలు కల్పించనప్పుడు ఎందుకు ఆశీలు వసూలు చేస్తున్నారు.

–బొడ్డేపల్లి చిరంజీవి, వ్యాపారి, కనుగులవలస

షెడ్లు నిర్మించాలి: సంతలో వ్యాపారులకు షెడ్లు నిర్మించే విధంగా మున్సిపాలిటీ చర్యలు చేపట్టాలి. గత అయిదేళ్లలో ఈ సంత వేలం పాట ద్వారా మున్సిపాలిటీకి వచ్చిన డబ్బులు ఏమయ్యాయో కూటమి ప్రభుత్వం తెలుసుకోవాలి.

–జోగి చంద్రశేఖర్, కుమ్మరిపేట

సౌకర్యాలు కల్పిస్తాం: చింతాడ సంతను పరిశీలించి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు చేపడతాం. వర్తక, వ్యాపారస్థులు, రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఇప్పటికే మరుగుదొడ్ల చుట్టుపక్కల తుప్పలు తొలగించాం. వీటిలో నీటి సదుపాయం కల్పిస్తాం. సమస్యలను పాలకులు, జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు, షెడ్లు నిర్మించేందుకు కృషి చేస్తాం.

–పూజారి బాలాజీప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

ప్రధాన పైపులైన్ పరిశీలన

స్పందనకు వందనం

మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని వార్డుల్లోని కాలువలో ఉన్న తాగునీటి ప్రధాన పైపులైన్‌ను ఎమ్మెల్యే కూన రవికుమార్ మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. తాండ్రాసి మెట్ట వద్ద పంపు హౌస్ నుంచి పట్టణానికి వస్తున్న ప్రధాన పైపులైన్ కాలువలో ఉండటంతో తాగునీరు కలుషితమయ్యే అవకాశాలు ఉన్నాయని మంగళవారం 'ఈనాడు'లో 'కాలువల్లో పైపులైన్లు' శీర్షికతో సమస్యా చిత్రాన్ని ప్రచురించడంతో ఎమ్మెల్యే కూన రవికుమార్ స్పందించారు. పట్టణంలోని ప్రధాన కాలువలు, వాటిని ఆనుకొని ఉన్న పైపులైన్లను అధికారులతో కలిసి పరిశీలించారు. దీనితో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం



అహింసా వాదాన్ని ఆచరిద్దాం



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

గార, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ జాతిపిత మహాత్మా గాంధీని స్మరించుకుంటూ అహింసావాదాన్ని ఆచరిద్దామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. గార మండలం అంపోలులోని కేంద్ర కారాగారంలో బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాయాలకు అతీతంగా జీవన సాగించాలని సూచించారు. కారాగారం సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఏడుగురి ఎంపిక

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏడుగురు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. కర్నూలు జిల్లా నంద్యాల వేదికగా ఈ నెల 6 నుంచి జరగనున్న టోర్నమెంట్‌లో బాలుర విభాగంలో మెట్ట అఖిల్, యతిరాజుల లక్ష్మీప్రసాద్, మొదలవలస యశ్వంత్, సింహాద్రి, బాలికల విభాగంలో అన్నెపు సంధ్య, లావణ్య, దేవీప్రియలు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వారిని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కలిదిండి నరసింహారాజు, సెగిలిపిల్లి లక్ష్మి, కార్యనిర్వహణ కార్యదర్శి బి.వి.రమణ, ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, తదితరులు అభినందించారు.

కల్యాణ మండపం మేనేజర్‌పై దాడి



శ్రీకాకుళం నగరం 80 అడుగుల రోడ్డులోని ఓ కల్యాణ మండపం మేనేజరు ధనుంజయ్‌పై మంగళవారం రాత్రి ఓ మాజీ రౌడీషీటర్ దాడికి పాల్పడ్డాడు. గాయాలపాలైన ఆయన సర్వజనా సుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ దాడి నేపథ్యంలో ఏపీ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మెట్టనాగరాజు ఆధ్వర్యంలో బుధవారం జిల్లాశాఖ సమావేశం నిర్వహించారు. హోటల్స్ యాజమాన్యం, సిబ్బందిపై జరుగుతున్న వరుస దాడులను ఖండించారు. రౌడీషీటర్ల నుంచి తమకు రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసి బుధవారం వినతి పత్రం అందించారు.

–న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

ప్రమాదకరంగా పనికిరాని మొక్కలు


బూర్జ మండలంలో ఏ రహదారి చూసినా ఈ విధంగా రహదారిపైకి దట్టంగా పనికిరాని మొక్కలు చొచ్చుకొచ్చి వాహన చోదకుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. మార్గంలో మలుపులతో పాటు మొక్కలు ముందుకు చొచ్చుకురావడంతో ప్రమాదాలకు గురవుతున్నట్లు పలువురు వాపోతున్నారు. బూర్జ గ్రామానికి వెళ్లే రహదారి పరిస్థితి ఇది. వీటిని తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ జేఈ ఆంజనేయ నాయక్‌తో 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా వీటిని పరిశీలించి తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, బూర్జ



ఎంత నిర్లక్ష్యమో..!

సరుబుజ్జిలి మండల కేంద్రానికి అనుసరించి ఉన్న నంది కొండ కాలనీలోని మధ్య వీధిలో విద్యుత్తు స్తంభం పరిస్థితి ఇలా ఉంది. విద్యుత్తు సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉంది ఈ స్తంభం. ఇలా పచ్చని తీగబద్దు అల్లుకుని దర్శనమిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. ఆ స్తంభం వైపు వెళ్తే ఏ క్షణంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఏఈ అప్పలనాయుడు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా సిబ్బందిని పంపించి సరిచేయిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి



108 వాహనంలో ప్రసవం

గార మండలం కొత్తూరు-సైరిగాం పంచాయతీ రాఘవాపురం గ్రామానికి చెందిన చింతాడ రోజా అనే గర్భిణికి బుధవారం 108 వాహనంలోనే ప్రసవం జరిగింది. శ్రీకాకుళం తీసుకువెళ్తుండగా శ్రీకూర్మం కూడలి సమీపంలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో వాహనాన్ని వాహనాన్ని ఆపి సిబ్బంది ప్రసవం చేశారు. పైలట్ నారాయణరావు, ఈఎంటీ హరీష్, ఆశా కార్యకర్త రమాదేవికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. – న్యూస్‌టుడే, గార



వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి

పొందూరు, న్యూస్‌టుడే: వృత్తి విద్యలో విద్యార్థులు నైపుణ్యం సాధించాలని వావిలిపల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ హెచ్.ప్రభాకర్ అన్నారు. బుధవారం స్కిల్ డెవలప్‌మెంటు ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. పొందూరులో ఖాదీ తయారీ, కంప్యూటర్ సెంటర్‌లో కంప్యూటర్ పరిజ్ఞానం, మార్కెటింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర అంశాలపై ఉపాధ్యాయురాలు సీపాన మాలతి అవగాహన కార్యక్రమం చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపల్ ప్రభాకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


పొందూరు ఖాదీ దుకాణంలో విద్యార్థులతో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు

మెహెర్‌బాబా సందేశం అనుసరణీయం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం కత్తెర వీధిలోని అవతార్‌మెహెర్‌బాబా కేంద్రంలో బుధవారం పాతశ్రీకాకుళం మెహెర్ బాబా కేంద్రం వార్షిక వేడుకలు, మెహెర్ ప్రేమికుల సత్సంగం, సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. బీవీఎస్ శ్రీనివాసరావు సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. విశాఖపట్నానికి చెందిన పావని మెహెర్ బాబా సత్యప్రేమ సందేశం తెలియజేశారు. కన్వీనర్లు ఆనందరావు, రంగప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


సత్సంగంలో పాల్గొన్న మెహెర్ ప్రేమికులు

క్రీడా పరికరాల అందజేత

గార, న్యూస్‌టుడే: గార మండలం అంపోలు జడ్పీ ఉన్నత పాఠశాలకు కృషి సంస్థ ప్రతినిధి డా.అమ్మనరావు క్రీడాపరికరాలను సమకూర్చారు. వాలీబాల్స్, బ్యాడ్మింటన్ రాకెట్లు, స్కిప్పింగ్ తాళ్లు, తదితరాలను ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిలక్ష్మీ నారాయణకు బుధవారం అందజేశారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం గుడివీధిలోని ఉమారుద్రకోటేశ్వరాలయంలో బుధవారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం పోలాల అమావాస్య సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు చేసినట్లు ఆలయ అర్చకులు ఆరవెల్లి రామ్‌జీ తెలిపారు

రామరాజు సేవలు ఎనలేనివి



పొందూరు, న్యూస్‌టుడే: మండల విద్యాశాఖాధికారిగా రామరాజు అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరు మండల విద్యాశాఖాధికారి-1 పి.వి.రామరాజు ఉద్యోగ విరమణ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారి-2 పట్నాన రాజారావు అధ్యక్షతన నిర్వహించిన సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రామరాజు దంపతులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి, ఎంపీడీవో హరిహరరావు, ఎచ్చెర్ల, ఆమదాలవలస మండల విద్యాశాఖాధికారులు పున్నయ్య, ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..అన్నీ

డచ్ భవనం వద్ద సందడి



న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం: శ్రీకాకుళం నగరం కలెక్టరేట్ సమీపంలోని డచ్ భవనం వద్ద బుధవారం సందడి వాతావరణం నెలకొంది. 'స్వచ్ఛతా హీ సేవ' ముగింపు కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ కార్మికులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో పలువురికి ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా ధ్రువపత్రాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

చర్చిలో ప్రార్థనలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని కలెక్టర్ కార్యాలయం రహదారిలో ఉన్న ఆంధ్రా బాప్టిస్టు చర్చిలో బుధవారం ప్రార్థనలు జరిపారు. ఎన్.సురేష్ స్వాగత వచనాలతో ప్రారంభమైన కార్యక్రమంలో బిషప్ వి.జాషువా, మండా ఎలీసా, చల్లా కరుణాకర్, పలువురు క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

వైకుంఠపురంలో గ్రామసభ

బూర్జ, న్యూస్‌టుడే: మండలంలోని వైకుంఠపురం సర్పంచి బొడ్డేపల్లి వెంకట సత్యం అధ్యక్షత బుధవారం గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులపై గ్రామసభ ఏర్పాటు చేశారు. ఇందులో ఉపాధిహామీ పథకం ఏపీడీ పి.రాధ, ఏపీవో రాజకుమార్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కాలపర్తి పంచాయతీలో కూడా నిర్వహించినట్లు ఏపీవో తెలిపారు.

ఆటో బోల్తాపడి ఒకరికి తీవ్ర గాయాలు

బూర్జ, న్యూస్‌టుడే: మండలంలోని డొంకలపర్తకు చెందిన తొమ్మిది మంది పాలకొండ మండలంలోని అర్థలిలో ఇటీవల మృతి చెందిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు బుధవారం ఉదయం ఆటోలో బయలుదేరారు. పాలకొండలోని వాహన తనిఖీ కేంద్రం వద్ద వీరఘట్టానికి వెళ్లే కూడలిలో ఏర్పడిన గుంతల కారణంగా వెళ్తున్న ఆటో ఒక్కసారిగా బోల్తాపడింది. దీంతో చందక ఆంజనేయులుకు తీవ్ర గాయాలు కాగా, మిగతా ఎనిమిది మందికి చిన్నపాటి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని వెంటనే మెరుగైన వైద్యం కోసం 108 వాహనం సాయంతో శ్రీకాకుళంలోని ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

నవ సమాజ స్థాపకులు విద్యార్థులే

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: నవ సమాజ స్థాపకులు విద్యార్థులేనని మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్ అన్నారు. బుధవారం మెట్టక్కివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని, స్వర్ణాంధ్రా-2047 జిల్లా పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన జి.నిహను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాటాంలడాకె, మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, తెదేపా నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మకు పూజలు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలం, పట్టణ ప్రాంతాల్లో బుధవారం అమావాస్య సందర్భంగా పోలేరమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ముఖ్యంగా రైతులు అధిక సంఖ్యలో పూజలు చేశారు.



గాన గంధర్వుడికి స్వర నీరాజనం

హిరమండలం, న్యూస్‌టుడే: శ్రీ నీలమణి దుర్గా ఉత్తరాంధ్ర కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు, హిరమండలానికి చెందిన గాయకులు సుభలయ ఆర్ ఆర్ కాలనీ సామాజిక భవనంలో బుధవారం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాన గంధర్వుడికి స్వర నీరాజనంతో అంజలి ఘటించారు. గాయకులు ఆయన పాడిన గీతాలను ఆలపించారు.

దేశంలో నియంతృత్వ పాలన

టెక్కలి, న్యూస్‌టుడే: దేశంలో నియంతృత్వ పాలన సాగుతుందని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.పరమేశ్వరరావు అన్నారు. స్థానిక కంచ్ర వీధిలోని గాంధీ ఆలయంలో బుధవారం వినతి పత్రం అందించారు. కేంద్రప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. పార్టీ నాయకులు మధుసూదనరావు, ఆనందరావు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల: అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద వీసీ ఆచార్య కె.ఆర్.రజని, ఇతర అధికారులు



శ్రీకాకుళం నగరంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు

గాంధీజీ ఆశయ సాధనకు పాటుపడాలి

గాంధీ మహాత్ముడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా ఆయా చోట్ల దివంగత మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. –న్యూస్‌టుడే బృందం


శ్రీకాకుళం నగరంలోని లాల్‌బహుదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గాంధీ మందిరం కమిటీ సభ్యులు


ఆమదాలవలస పట్టణంలో గాంధీ విగ్రహంవద్ద వైకాపా శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం, తదితరులు


శ్రీకాకుళం నగరంలోని తెదేపా జిల్లా కార్యాలయంలో..